# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023






### పరిశ్రమలకు కప్పలబండ సిద్ధం

పుట్టపర్తిలోని కప్పలబండ పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్లాట్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. రెండు రోజుల్లో అందుబాటులోకి రానుంది. 8లో



### కిలో టమాట రూ.20

అనంత శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 555 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.




జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వలంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### శుభ్రత పాటించాలి

- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ సూచన

**రొద్దం:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంట చేసే ప్రాంతంలో శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడరాదని పాఠశాల హెచ్‌ఎం పద్మజరెడ్డికి సూచించారు. భోజనానికి వాడే ప్రతి సరుకూ నాణ్యంగా ఉండాలని పేర్కొన్నారు.

### 95 శాతం పింఛన్ల పంపిణీ

**పుట్టపర్తి అర్బన్:** సామాజిక భద్రతా పింఛన్లను 95 శాతం మేర పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో 32 మండలాల పరిధిలోని 2,66,045 మంది లబ్ధిదారులకు రూ.73,82,47,500 నగదు మంజూరైందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రానికి 2,52,159 మందికి రూ.69,96,09,250 నగదు మొత్తాన్ని అందజేసినట్లు వివరించారు. మరో మూడు రోజులు పంపిణీకి సమయం ఉందని, అందరికీ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

### నేడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

**కొత్తచెరువు:** రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేస్తారన్నారు. నాడు-నేడు, విద్యాదీవెన తదితర పథకాల అమలు తీరుపై ఆరా తీస్తారని పేర్కొన్నారు.

### స్కిల్ హబ్ ఏర్పాటు

**పెనుకొండ:** పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి గురువారం తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి డేటా ఎంట్రీ, ఆపరేటర్, ఆటోమేటిక్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ చదివిన యువత పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7989479371 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కళాశాలలోనూ నేరుగా సంప్రదించవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తామని తెలిపారు.

### లేపాక్షిని సందర్శించిన కర్ణాటక అధికారులు



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న కర్ణాటక ఉన్నతాధికారులు

**లేపాక్షి:** లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని గురువారం సాయంత్రం కర్ణాటక ఉన్నత స్థాయి అధికారుల బృందం సందర్శించింది. ఈ నెల 7న జరిగే జీ-20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు 20 దేశాల నుంచి 60 మంది డెలిగేట్స్ రానున్నారు. వీరు లేపాక్షిని సందర్శించనున్నారు. లేపాక్షిలో వారు పొందిన అనుభూతులను వారి దేశాల్లో ప్రముఖంగా ప్రచారం చేసేలా కర్ణాటక టూరిజం, రెవెన్యూ శాఖ వ్యూహాన్ని రచించాయి. దీంతో కర్ణాటక ఇంటిలిజెన్స్ డీఎస్పీ కుమారప్ప, రెవెన్యూ శాఖ ఏసీ అశ్విన్ తదితరులు వీరభద్రస్వామి ఆలయాన్ని పరిశీలించారు. విదేశీ ప్రతినిధుల పర్యటనలో ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.వారి వెంట పెనుకొండ ఇన్‌చార్జ్ డీఎస్పీ యశ్వంత్, హిందూపురం రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ ఉన్నారు.

### రేపు రైతు ఉత్పత్తిదారు సంస్థల సమ్మేళనం

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** రాయలసీమ రైతు ఉత్పత్తిదారు సంస్థల సమ్మేళనాన్ని ఈ నెల 4న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమ్మేళనానికి రాయలసీమ జిల్లాల్లోని 120 ప్రగతిశీల రైతు ఉత్పత్తిదారు సంస్థల నుంచి 200 మంది సన్న, చిన్నకారు రైతులు హాజరవుతారన్నారు. వీరితో పాటు ఏపీ ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన, ఆహార, పరిశ్రమల నుంచి ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని రైతు ఉత్పత్తిదారు సంస్థల సుస్థిరతకు సలహాలను అందిస్తారన్నారు.

# సెల్ రోగం

ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్ లేకపోతే ఏ ఒక్క పని జరగని పరిస్థితి. సెల్‌ఫోన్ వల్ల జరిగే మంచిని అటుంచితే... ఇప్పటికే చాలామంది ఎక్కువగా మొబైల్ ఫోన్లు వినియోగిస్తూ రకరకాల రుగ్మతల బారిన పడుతున్నారు. కంటి సమస్యలతో కొందరు, గేమింగ్‌కు బానిసలై మరి కొందరు, మానసిక సమస్యలతో కూడా ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. తాజాగా 'టెక్ట్స్ నెక్ సిండ్రోమ్' (మెడకు సంబంధించిన నొప్పి) పట్టిపీడిస్తోంది.

- ఉరవకొండకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ చదువుతోంది. తల ఓవైపునకు వంచినట్టు ఉందని బాధపడుతుంటే తల్లిదండ్రులు డాక్టర్‌కు చూపించారు. ఈమె ఎక్కువగా సెల్‌ఫోన్ వాడటం వల్ల ఇలా జరిగిందని న్యూరో వైద్యులు చెప్పారు. ఇప్పుడామె నొప్పి భరించలేక ఆక్యుపేషనల్ థెరఫీ చేయిస్తోంది.
- అనంతపురానికి చెందిన అనీల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమెరికాలో కూడా పదేళ్లు పనిచేసి వచ్చారు. మొబైల్ ఫోన్ వాడకం పెరిగి ఆయనకు మెడనొప్పితో పాటు నడుమునొప్పి వచ్చింది. నగరంలోనే ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.



- మొబైల్స్‌ను అధికంగా వినియోగిస్తుండటంతో అనేక రుగ్మతలు
- పెరుగుతున్న 'టెక్ట్స్ నెక్ సిండ్రోమ్' బాధితులు
- గంటల తరబడి చూస్తుండటంతో దెబ్బతింటోన్న నాడీ వ్యవస్థ
- మేల్కోకపోతే ముప్పు తప్పదంటున్న వైద్యులు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంత జిల్లాలో స్మార్ట్ ఫోన్ వాడుతున్న వారిలో ఎక్కువ మంది 'టెక్ట్స్ నెక్ సిండ్రోమ్ 'కు గురవుతున్నట్లు తేలింది. దీనివల్ల మెడ వంకర్లు పోవడం, మెడనొప్పి రావడం, తలెత్తుకు తిరగలేకపోవడం జరుగుతోంది. ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ ఎర్గానోమిక్స్ అనే జర్నల్ టెక్ట్స్ నెక్ సిండ్రోమ్ పెద్ద భూతంలా వేధిస్తోందని వెల్లడించింది. ఈ సిండ్రోమ్ కారణంగా నాడీ వ్యవస్థ దెబ్బతింటోందని వైద్యులు చెబుతున్నారు.

**ఏమిటీ టెక్ట్స్ నెక్ సిండ్రోమ్?**

టెక్ట్స్ నెక్ సిండ్రోమ్ అనేది వైరసో, బాక్టీరియానో కాదు. తదేకంగా సెల్‌ఫోన్‌ను వాడుతున్న వారికి వచ్చే ప్రత్యేక జబ్బు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారిలో ఈ పరిణామాలు తీవ్రంగా ఉన్నాయి. ప్రధానంగా టెక్ట్స్ మెసేజ్‌లు ఎక్కువ సేపు చూస్తూండటం వల్ల మెడ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు తేలింది. దీంతో మెడ కండరాలు, నరాలు ఒత్తిడికి గురై నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తున్నాయి. దీనివల్ల విపరీతమైన తలనొప్పి, భుజాల నొప్పి రావడం, ఇది ఇలాగే కొనసాగి, తొడ నుంచి పాదం వరకూ జాలుగా నొప్పిరావడం వంటివి జరుగుతున్నాయి. నిద్రలేమి, మానసిక ఒత్తిడి కూడా ఎదుర్కొంటున్నారు.



### ఉమ్మడి అనంత జిల్లాలో పరిస్థితి ఇలా...

| | |
|---|---|
| స్మార్ట్‌ఫోన్ వాడకందారులు | 14 లక్షలు పైగా |
| సగటున రోజూ సెల్‌ఫోన్ వాడుతున్న గంటలు | 5 గంటలు |
| మొబైల్ ఎక్కువగా వాడుతున్న వయసు వారు | 25-30 ఏళ్ల వారు |
| పాక్షికంగా మెడ సమస్యను ఎదుర్కొంటున్నది | 40 శాతం మంది |
| తీవ్ర మెడనొప్పి ఎదుర్కొంటున్నది | 10 శాతం మంది |

### టెక్ట్స్ నెక్ సిండ్రోమ్ నుంచి బయట పడండిలా...

- రెండు, మూడు నిముషాలకు కంటే ఎక్కువగా మెడలు వంచి సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు చూడకూడదు.
- స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారు పదే పదే మెడను రొటేట్ అంటే కుడి నుంచి ఎడమకు ఎడమ నుంచి కుడికి తిప్పుతూ ఉండాలి.
- ప్రతి గంటకోసారి రెండు మూడు సార్లు తలను పైకెత్తి మళ్లీ కిందికి బలవంతంగా వంచాలి.
- మెసేజ్‌ను చదవాలనుకున్నప్పుడు కుర్చీలో వెనక్కు వాలి ఫోన్‌ను ముఖంపైకి తెచ్చుకుని చదువుకోవాలి.
- పెద్ద పెద్ద మెసేజ్‌లు ఉన్నప్పుడు అంతా ఒకేసారి చదవకుండా మధ్యలో విరామం తీసుకుని మెడ వ్యాయామం చేయాలి.
- రోజూ యోగాసనాలు చేస్తే కండరాలు, నరాల వ్యవస్థ సానుకూలంగా మారి నొప్పి నివారిణిగా పనిచేస్తుంది.

### వ్యాయామమే పరిష్కారం



చాలామంది టెక్ట్స్ నెక్ సిండ్రోమ్ గురై మెడనొప్పి తట్టుకోలేక పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారు. ఇది కరెక్టు కాదు. దీని వల్ల తాత్కాలికంగా నొప్పి తగ్గచ్చుగానీ, భవిష్యత్‌లో ప్రమాదం ఎక్కువ. తలకు, మెడకు సంబంధించి వ్యాయామం మంచిది. యోగా వల్ల చాలా వరకు నొప్పిని నియంత్రించుకోవచ్చు.

– జి.నరేష్‌బాబు, మెడ, వెన్నుపూస వైద్య నిపుణులు

### తక్కువ సేపు వాడాలి



మొబైల్ ఫోన్లు చిన్నతనం నుంచే అలవాటు పడిన చాలామంది పిల్లలు ఇప్పటికే దృష్టిలోపంతో బాధపడుతున్నారు. గంటల తరబడి ఫోన్ చూడటం వల్ల సున్నితమైన కంటికి సంబంధించి అవయవాలు దెబ్బతింటున్నాయి. వీలైనంత తక్కువ సేపు వాడటం మంచిది.

– వల్లంరెడ్డి నివేదిత, కంటివైద్య నిపుణురాలు

### ఉచ్చులో ఇరుక్కుపోయారు



ఓ వైపు మెడనొప్పి, నడుమునొప్పులే కాదు.. రాత్రిళ్లు ఎక్కువగా మొబైల్ వాడి గేమింగ్, బెట్టింగ్‌ల కారణంగా వ్యసనాలకు లోనయ్యారు. నిద్రలేమి కారణంగా మెంటల్ కండీషన్ ఇన్‌బ్యాలెన్స్ అవుతోంది. చాలా మందికి చదువుమీద దృష్టి పోతోంది. మానసిక బలహీనతల వల్ల డ్రగ్స్ వైపు దృష్టి సారిస్తున్నారు.

– డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు

### రెండు ఎంపీపీ స్థానాలకు నేడు ఎన్నికలు

**అనంతపురం సిటీ:** ఉమ్మడి జిల్లాలో చెన్నేకొత్తపల్లి, విడపనకల్లు ఎంపీపీ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోగా ఎంపీపీలుగా ఎవరు ఎన్నికైంది ప్రకటించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. విడపనకల్లు ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించగా, వేల్పుమడుగు ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మను ఎంపీపీగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. ఏడాది కాలం ఎంపీపీగా పని చేసిన ఆమె ఆ తరువాత పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. అలాగే, బీసీ మహిళకు రిజర్వ్ అయిన చెన్నేకొత్తపల్లి ఎంపీపీ పదవికి ప్రవీణ ఎన్నికయ్యారు. ఆమె కూడా ఇటీవల పదవికి రాజీనామా చేసి, నాగసముద్రం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. దీంతో రెండు మండలాల ఎంపీపీ పదవులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థి ఎవరనేది గుర్తింపు పొందిన పార్టీల జిల్లా అధ్యక్షులు బీఫారం పంపుతారని సీఈఓ తెలిపారు. ఇప్పటికే అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బీ ఫారాలు పంపినట్లు సమాచారం. దాదాపుగా ఎన్నికల ప్రక్రియ ఏకగ్రీవంగా ముగియనుంది. పోటీ లేకపోవడంతో అధికార పార్టీ అభ్యర్థులే రెండు స్థానాల్లోనూ ఆశీనులు కానున్నారు. ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

### 10 నుంచి సీఎం కప్ పోటీలు

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లా స్థాయి ఏపీ సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులకు మొత్తం 14 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. జిల్లా స్థాయి పోటీలను ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియంలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10న ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో, హాకీ, హ్యాండ్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, 11న ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. 10న ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, 11న కబడ్డీ, బాస్కెట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 08554-353223 నంబరును సంప్రదించాలన్నారు.

## భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ బసంత్‌కుమార్, జేసీ చేతన్

**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలో ఏర్పాటవుతున్న జాతీయ రహదారుల కోసం భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ బసంత్‌కుమార్ అన్ని శాఖల జిల్లాధికారులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద చేపడుతున్న రీసర్వే, ఈ క్రాప్ బుకింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణాలు, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు జగనన్న విదేశీ విద్య నిధుల విడుదల..

'జగనన్న విదేశీ విద్య' పథకానికి శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిధులు విడుదల చేయనున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొట్టమొదటి సారిగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, పురప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. జిల్లాలో ఒక బీసీ, ఇద్దరు ఈబీసీ విద్యార్థులకు మొదటి విడతలో రూ.27,17,009 మంజూరైనట్లు వివరించారు. వీరిలో డి. అనిత (ఇటలీలో ఎమ్మెస్సీ సివిల్ ఇంజినీరింగ్), కే. రాజశేఖర్‌రెడ్డి (అమెరికాలో ఇంజినీరింగ్), జి.భార్గవసాయి (అమెరికాలో కంప్యూటర్ సైన్స్) ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు'లో భాగంగా విదేశీ విద్య కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.50 లక్షల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నాలుగు విడతలుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.15 లక్షలు, బీసీ, కాపు విద్యార్థులకు రూ.10 లక్షల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేదని ఆయన గుర్తు చేశారు.

## హోదా పెరిగింది..

పుట్టపర్తి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. సత్యసాయి నిర్యాణం తర్వాత కళ తప్పిన పట్టణాన్ని శ్రీ సత్యసాయి జిల్లాగా ఏర్పాటు చేసి భక్తులు, ప్రజలకు శుభవార్త చెప్పిన వైఎస్ జగన్ సర్కారు.. పట్టణాన్ని మరింత ప్రగతి బాట పట్టించేందుకు తాజాగా హోదా పెంచింది.




### పుట్టపర్తి.. ఇక గ్రేడ్-2 మున్సిపాలిటీ

- ప్రగతికి మరో ముందడుగు
- మెరుగవనున్న సేవలు

**ప్రశాంతి నిలయం:** పుట్టపర్తి అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం మరోమారు చిత్తశుద్ధిని చాటుకుంది. నగర పంచాయతీగా ఉన్న పట్టణాన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ గురువారం గెజిట్ (జీఓ నెం.18) విడుదల చేసింది. జిల్లా కేంద్రంగా ఉన్న పుట్టపర్తిని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది.

**పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు...**

సాధారణ పంచాయతీగా ఉన్న పుట్టపర్తిని 2006లో ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, బడేనాయక్ తాండా పంచాయతీలను కలుపుకుని మేజర్ పంచాయతీగా ఏర్పాటు చేశారు. 2011లో జనాభా లెక్కల ప్రకారం 31,610 జనాభా ఉన్న పుట్టపర్తి మేజర్ పంచాయతీని 20 వార్డులుగా విభజించి నగర పంచాయతీగా ప్రకటించారు. ఇటీవల ప్రభుత్వం పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేయడంతో పట్టణాన్ని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలోనే పుట్టపర్తిని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలంటూ గతేడాది నవంబర్‌లో కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపగా.. పరిశీలించిన సర్కారు ఆ మేరకు గెజిట్ విడుదల చేసింది.

**పెరగనున్న సేవలు.. అభివృద్ధికి బాటలు..**

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడంతో ఇకపై అభివద్ధి పనుల కోసం ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో పాటు సిబ్బంది సంఖ్య కూడా పెరగనుంది. దీంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ఇంజినీరింగ్ విభాగానికి ఒక డీఈ పోస్టుతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి, అదనంగా మరో ఇంజినీర్ పోస్టు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 3, పారిశుధ్య పనుల కోసం 40 మంది, వాటర్ వర్క్ సిబ్బంది మరో 20 మంది పెరగనున్నారు.

**ఎమ్మెల్యే ప్రత్యేక ముద్ర..**

పుట్టపర్తి అభివృద్ధిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తనదైన ముద్ర వేసుకుంటున్నారు. మూడేళ్ల కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు మండలాల మీదుగా ఎన్‌హెచ్ -342, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇక.. నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే చెరువుల అనుసంధానానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తాజాగా గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం వెనుక కూడా ఎమ్మెల్యే కీలకపాత్ర పోషించారు.


### అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



పుట్టపర్తి అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉంది. పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటు చేసి ప్రగతికి బాటలు వేశాం. పుట్టపర్తి మీదుగా జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రంతో ఆమోదింపజేశాం. నియోజకవర్గంలో 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ క్రమంలోనే మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ గెజిట్ విడుదల చేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనం.

– దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే

### ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



మున్సిపాలిటీగా అవతరించడంతో ప్రభుత్వం నుంచి అందే నిధులు గణనీయంగా పెరుగుతాయి. మరింత వేగంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుంది. సిబ్బంది సంఖ్య కూడా పెరిగి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ప్రభుత్వం నిర్ణయం హర్షణీయం.

– తుంగ ఓబుళపతి, మున్సిపల్ చైర్మన్




ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న కలెక్టర్ చాంబర్

## కొత్తకొత్తగా ఉన్నది..

- కలెక్టరేట్‌కు నూతన సొబగులు

**పుట్టపర్తి అర్బన్:** కలెక్టరేట్‌కు నూతన సొబగులు అద్దుతున్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న పుట్టపర్తిని గతేడాది శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించిన వెంటనే పాలనా అనుమతులు వచ్చేశాయి. వెనువెంటనే కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌కు సంబంధించిన మిర్‌పురీ సంగీత కళాశాల భవనంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో కేవలం గదులను సిద్ధం చేసుకొని విధి నిర్వహణలో మునిగిపోయారు. రానున్న ఏప్రిల్‌కు ఏడాది పూర్తవుతున్న దృష్ట్యా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అన్ని వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కార్యాలయంలో పనులు చేపడుతున్నారు. సుమారు నెల నుంచి కలెక్టర్, జేసీ చాంబర్లు, స్పందన, వీడియో కాన్ఫరెన్స్ కార్యాలయాలు, స్పందన అర్జీలు రాయడానికి అవసరమైన గదులు, వాటిని కంప్యూటరీకరణ చేసే గదులు, ఇతర శాఖల అధికారుల గదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా కలెక్టర్, జేసీ చాంబర్లలో రాష్ట్ర ప్రభుత్వం లోగో, సీఎం వైఎస్ జగన్ ఉన్న నవరత్నాల లోగో, సత్యసాయి బాబా చిత్రపటాలను మరింత ఆకర్షణీయంగా తయారు చేసి ఏర్పాటు చేశారు. కలెక్టర్ బసంత్‌కుమార్ గురువారం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

## యువకుడి దుర్మరణం

రామగిరి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన ఓబుళపతి, తిమ్మక్క దంపతుల కుమారుడు బొమ్మ శంకర్ (24) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సొంత పనిపై గ్రామానికి వచ్చిన శంకర్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బెంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో పేరూరు సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ఘటనపై రామగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఎన్ఎంయూ ఏపీ ఉపాధ్యక్షుడిగా హరిమోహన్



కదిరి అర్బన్: నేషనల్ మజ్దూర్ యూనియన్ ఏపీ ఉపాధ్యక్షుడిగా కదిరి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ ప్రచార కార్యదర్శిగా, 5 సార్లు కో ఆపరేటివ్ సొసైటీ డెలిగేట్‌గా హరిమోహన్ పనిచేశారు. హరిమోహన్ నియామకంపై కదిరి డిపో ఎన్ఎంయూ నాయకులు రామకృష్ణ, బైరిశెట్టి, నారాయణస్వామి, ప్రభాకరరెడ్డి, డీఎల్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు.

# పరిశ్రమలకు కప్పలబండ సిద్ధం



ఎంఎస్ఎంఈ పార్కులో తారు రోడ్లు వేస్తున్న దృశ్యం




సిద్ధమైన కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కు




ఇండస్ట్రియల్ పార్కు కోసం కొనుగోలు చేసిన భూములు

- రూ.5.85 కోట్లతో అభివృద్ధి పనులు
- 171 ప్లాట్లను సిద్ధం చేసిన ప్రభుత్వం
- చదరపు మీటరుకు రూ.1,730 ధర నిర్ణయం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలోని కప్పలబండ పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్లాట్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. గతంలో సరైన పనులు చేపట్టకపోవడంతో నిరాదరణకు గురైన కప్పలబండ పారిశ్రామిక వాడలో గత ఏడాది మే నెలలో అభివృద్ధి పనులకు జగన్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ప్లాట్లను సిద్ధం చేసి మరో రెండు రోజుల్లో పారిశ్రామిక వేత్తలకు అందుబాటులోకి తీసుకురానుంది.

**109 ఎకరాల్లో..**

పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా దాదాపు ఎనిమిదేళ్ల క్రితం కప్పలబండ రెవెన్యూ పరిధిలో 109 ఎకరాలను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) కొనుగోలు చేసింది. అప్పట్లో ఎకరాకు రూ.11.20 లక్షలు చొప్పున పరిహారాన్ని రైతులకు చెల్లించారు. 2018 చివర్లో అప్పటి ప్రభుత్వం జేసీబీలతో చదును చేయించి, అక్కడక్కడ రోడ్లు చేసి కొంత మేర కంకర తోలి వదిలేసింది. వంద లారీల ఇసుకను డంప్ చేశారు. ప్రభుత్వం మారిన తరువాత సంబంధిత కాంట్రాక్టర్ ఈ పనులు వదిలేసి డంప్ చేసిన ఇసుకను, కొంత కంకర కుప్పలను ఇతర ప్రాంతాలకు తరలించుకున్నాడు.

**వడివడిగా అడుగులు..**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏపీఐఐసీ భూముల అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడానికి అనువుగా ప్లాట్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.5.85 కోట్లను విడుదల చేసింది. పారిశ్రామిక వాడలో 36 కల్వర్టుల నిర్మాణాలు పూర్తయ్యాయి. సీసీ డ్రెయినేజీ కోసం నాలుగు కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు వేశారు. 4.545 కిలోమీటర్ల మేర అంతర్గతంగా తారు రోడ్లు వేశారు. ఇప్పటికే విద్యుత్ శాఖ పనులు దాదాపు పూర్తయ్యాయి.

**దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం..**

మరో రెండు రోజుల్లో 50 ఎకరాల్లో 171 ప్లాట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మోహన్ మురళి తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేయదలచుకున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏపీఐఐసీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్లాట్‌లో చదరపు మీటరుకు రూ.1,730 చొప్పున ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 22 శాతం స్థలాల కేటాయింపు ఉంటుందన్నారు.

**59 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు..**

కప్పలబండ రెవెన్యూ పొలంలో సేకరించిన 50 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును సిద్ధం చేసిన ఏపీఐఐసీ సంస్థ ఆ పక్కనే ఉన్న మరో 59 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును సిద్ధం చేయనున్నారు. దీని నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. భూమి కొనుగోలు చేసి రైతులకు పరిహారం అందజేశారు.

## హనుమద్ వాహనంపై రంగనాథుడు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ఉత్సవ మూర్తులు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నాల్గో రోజు దేవేరులతో కలసి రంగనాథుడు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను జమ్మి చెట్టు వరకూ ఊరేగించి ఆలయంలో కొలువు దీర్చారు. ఆలయ ఈఓ దేవదాసు, సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సరిహద్దు దాటి పింఛన్ పంపిణీ



బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆయేషా

చిలమత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదలకు ఎంతో మేలు చేకూరుతోంది. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నానా ఇబ్బంది పడేవారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత ప్రతి నెల 1వ తేదీ వేకువజామునే ఇంటి వద్దకే పింఛన్ అందుతోంది. ఈ క్రమంలో చిలమత్తూరు మండలం కోడూరు–2 సచివాలయ పరిధిలోని సుబ్బరాయుపేట గ్రామానికి చెందిన వలంటీర్ ఆయేషా మరో అడుగు ముందుకేసి... బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వయోవృద్ధుడు షరీఫ్ సాహెబ్‌ను గురువారం కలసి పింఛన్ సొమ్ము అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్ ఆయేషాకు షరీఫ్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# వైభవం.. సునామ జకినీ మాత ఉత్సవం

గుత్తి: దేశంలోని నలుమూలల నుంచి తరలి వచ్చిన ఆరె కటికలతో గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలు కిక్కిరిసాయి. 'సునామ జకినీ మాతకీ జై' అనే నినాదాలతో వీధులన్నీ మారుమోగాయి. సునామ జకినీ మాత జాతర గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఆలయంలో సునామ జకినీ మాత, మల్కుమని జకినీ మాత మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. వేలాది భక్తులు బారులు తీరి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అనంతరం గుత్తిలోని శిరిడి సాయిబాబా ఆలయం వద్ద నుంచి అమృత్ థియేటర్, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ప్రభుత్వాస్పత్రి మీదుగా జకినీ మాత ఆలయం వరకూ 108 కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరి లక్ష్మణరావు, రాష్ట్ర నాయకుడు సాయి సుభాష్, ఆలయ ధర్మకర్త సురేష్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కసాపురం నాగరాజు, బాబురావు, సుధాకర్‌రావు, రవిబాబు, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రామచంద్రరావు, యూత్ నాయకులు భాగ్యరాజ్, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, ఆలయ మేనేజర్ పంకజ లక్ష్మి, సాయి సుభాష్ బాబు, మల్లేష్‌రావు, జగత్‌రావు, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.





కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటున్న భక్తులు, ప్రత్యేక వాహనంపై సునామ జకినీ మాత ఉత్సవ మూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

## పేకాటరాయుళ్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రొద్దం: మండలంలోని చిన్నమంతూరు సమీపంలోని చింత వనంలో గురువారం పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులను గమనించి ముగ్గురు పారిపోగా మిగిలిన 10 మందిని అరెస్ట్ చేసి, రూ.48 వేలు నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.



## 'అనంత'లో ఆర్ఏఎఫ్ బలగాలు



నగరంలో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఏఎఫ్ బలగాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రానికి గురువారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) దళం చేరుకుంది. ఈ క్రమంలో గురువారం సప్తగిరి సర్కిల్ వద్ద ఆర్ఏఎఫ్ బలగాలతో ఏర్పాటు చేసిన కవాతును అదనపు ఎస్పీ నాగేంద్రుడు ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా వాసులకు భద్రతతో పాటు భరోసా ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. విపత్తులు, ఆందోళనల సమయాల్లో ఈ దళం సహకారం మరువలేనిదన్నారు. సమస్యాత్మక, అతి సున్నిత ప్రాంతాలపై ఆర్ఏఎఫ్ బృందానికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హకీంపేట్ 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీఐలు రవిశంకరరెడ్డి, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల్లో విశ్వాసం పెంపొందిద్దాం..**

పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకుందామని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప సూచించారు. గురువారం అనంతపురానికి చేరుకున్న ఆర్ఏఎఫ్ బలగాలు ముందుగా జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీతో ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్ తదితరులు కలసి మాట్లాడారు.

## చికిత్సపొందుతూ యువతి మృతి

నల్లచెరువు: స్థానిక బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న షాహీద(34) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అనంతపురంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాలు... బాబాఫక్రుద్దీన్ కుమార్తె షాహీద గత నెల 31వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో విషపూరిత ద్రావకం తాగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక గురువారం ఆమె మృతి చెందింది.

# నిర్వాసితులకు న్యాయం చేస్తాం



రైతుల జాబితాను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

మడకశిరరూరల్: తాగునీటి పైప్‌లైన్‌తో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేస్తామని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ భరోసా ఇచ్చారు. మండలంలోని పాపసానిపల్లిని గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం తుమకూరు నుంచి పావగడకు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. భూములు సేకరిస్తుండడంతో మడకశిర మండలం గోవిందాపురం, పాపసానిపల్లి, కదిరేపల్లి, గుర్రపుకొండ గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ మడకశిర మండలంలో దాదాపు 4 కిలోమీటర్ల మీర పైపులైన్ పోతుందన్నారు. సంబంధిత ప్రాజెక్టు అధికారుతో మాట్లాడి న్యాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, పైపులైన్ ప్రాజెక్టు మేనేజర్ గిరీష్, సర్వేయర్ ఫణీంద్ర, రైతులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం.. నిందితుడి అరెస్ట్



నిందితుడు శ్రీనివాసులు

చిలమత్తూరు: బాలిక (12)పై అత్యాచారం చేసిన కేసులో ఆ బాలిక స్నేహితురాలి తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను సీఐ వేణుగోపాల్ వెల్లడించారు. చిలమత్తూరు మండలం నల్లరాళ్లపల్లికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు శ్రీనివాసులు బుధవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లి బెదిరించి అత్యాచారం చేశాడు. బాలిక ఇంటికి చేరుకున్న తర్వాత ఆమె శరీరంపై గాయాలు, రక్తస్రావమై అయిన విషయాన్ని గమనించి నిలదీయడంతో అసలు విషయం తెలిసింది. సమాచారం తెలుసుకున్న స్థానికులు శ్రీనివాసులును పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం నిందితుడిపై ఐపీసీ 376, 3 అండ్ 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# ఏపీ జేఏసీ జిల్లా కార్యవర్గం ఎంపిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఏపీ జేఏసీ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. చైర్మన్‌గా కలెక్టరేట్ ఈ–డీటీ మైనుద్దీన్, అసోసియేట్ చైర్మన్‌గా హిందూపురం కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య ఎంపికయ్యారు. అలాగే, కోచైర్మన్లుగా బాలానాయక్, లక్ష్మినారాయణ, శ్రీరాములు, పరిమళారెడ్డి, జనరల్ సెక్రటరీగా పద్మనాభరావ్, సెక్రటరీలుగా సురేష్‌బాబు, ఆనందరెడ్డి, రమేష్‌కుమార్ రెడ్డి, ట్రెజరర్‌గా సుబ్బారావును ఎంపిక చేశారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ దివాకరరావ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

**రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి..**

ఈ నెల 5న కర్నూలులో జరిగే ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర చైర్మన్ దివాకర్‌రావు, జిల్లా చైర్మన్ మైనుద్దీన్ పిలుపునిచ్చారు. మహాసభ పోస్టర్లను వారు విడుదల చేశారు.

## రూ.3 కోట్లతో వంతెన నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

కదిరి టౌన్: పట్టణంలోని నానా దర్గా వద్ద రూ.3 కోట్లతో చేపట్టిన మేజర్ బ్రిడ్జ్ పనులకు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గురువారం సాయంత్రం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం వైఎస్ జగన్ సహకారంతో పట్టణంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నానా దర్గా, ఎం.ఎస్.లాడ్జి ప్రాంతాల్లో వర్షాకాలంలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. వర్షం నీరు ఇళ్లలోకి చొరబడుతోందన్నారు. ముంపు నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు వంతెన నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మాజీ మంత్రి షాకీర్, కౌన్సిలర్లు ఖాశీం, రంగారెడ్డి, ఇస్మాయిల్, వైఎస్సార్ సీపీ నాయకులు నౌషాద్, వలీ ,ప్రకాష్ పాల్గొన్నారు.